నేడు మద్దిమడుగు నుంచి ఆర్ఎస్‌పీ ఎన్నికల ప్రచారం

- సాయంత్రం అచ్చంపేటలో రోడ్‌షో

అచ్చంపేట/అచ్చంపేటటౌన్/అమ్రాబాద్ , ఏప్రిల్ 24 : పదర మండలం మద్దిమడుగు నుంచి గురువారం బీఆర్ఎస్ నాగర్‌కర్నూల్ పార్లమెంట్ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నట్లు బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గువ్వల బాలరాజు ప్రకటనలో పేర్కొన్నారు. మద్దిమడుగు ఆలయంలో ఉదయం 8గంటలకు పూజలు నిర్వహించి అక్కడి నుంచి ఇప్పలపల్లి, కానుగుపెంట, మారడుగు, ఉడిమిళ్ల, పెట్రాల్‌చెను, చిట్లంకుంట, వంకేశ్వరం, పదర, రాయలగండి, కుమ్మరోనిపల్లి, అమ్రాబాద్, మన్ననూర్ గ్రామాల్లో ఎన్నికల ప్రచారం కొనసాగనున్నట్లు పేర్కొన్నారు. సాయంత్రం 6నుంచి రాత్రి 9గంటల వరకు అచ్చంపేట పట్టణంలో రోడ్‌షో నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమానికి నియోజకవర్గానికి చెందిన పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్దసంఖ్యలో తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

రేవల్లిలోని పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న డీఆర్డీవో నర్సింహులు

ఊర్కొండ, ఏప్రిల్ 24 : మండల కేంద్రంతోపాటు రేవల్లిలోని పోలింగ్ కేంద్రాలను మహబూబ్‌నగర్ జిల్లా డీఆర్డీవో నర్సింహులు బధువారం పరిశీలించారు. మండలంలోని రేవల్లిలోని 265, 266 పోలింగ్ కేంద్రాలను, ఊర్కొండలోని 263 పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ప్రతి పోలింగ్ కేంద్రాల్లో సంబంధిత అధికారులు మౌలిక వసతులపై దృష్టి సారించాలన్నారు.

కార్యక్రమంలో ఎంపీడీవో విజయ్ కుమార్, గ్రామ పంచాయతీ సెక్రటరీ దివ్యా పాల్గొన్నారు.

శ్రీశైలంలో వైద్య శిబిరం

శ్రీశైలం, ఏప్రిల్ 24 : ఆర్ట్ ఆఫ్ లివింగ్ అనుబంధ సంస్థ తత్వ ఆధ్వర్యంలో బుధవారం శ్రీశైలంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరం విజయవంతమైనట్లు నిర్వాహకులు తెలిపారు. శిబిరంలో నాడీ వైద్యనిపుణుడు డాక్టర్ రవితేజ యాత్రికులు, ఆలయ సిబ్బందికి నాడీ వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయుర్వేద వైద్యంతో సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చన్నారు. ప్రతి నెల బుధ, గురువారాలు క్షేత్ర పరిధిలో నాడీ పరీక్షలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

పీయూలో ప్రాంగణ ఎంపికలు

52 మంది విద్యార్థులు హాజరు

పాలమూరు, ఏప్రిల్ 24 : పాలమూరు విశ్వవిద్యాలయం లో బుధవారం ప్లేస్మెంట్ సెల్ ఆధ్వర్యంలో అన్నపూర్ల ఫైనాన్స్ సంస్థ వారు అసిస్టెంట్ మేనేజర్ల నియమాకానికి ఎంపికలు చేపట్టారు. ముఖ్య అతిథిగా పీజీ ప్రిన్సిపాల్ చంద్రకిరణ్ హాజ రై మాట్లాడారు. సాధన, ఆత్మస్థైర్యం, నైపుణ్యాలను పెంపొందించుకునేందుకు ప్రాంగ ణ ఎంపికలు ఎంతో ఉపయోగపడుతాయన్నారు. ఎంపికలకు 52 మంది హాజరయ్యారు.

రెండు కార్లు ఢీ, పది మందికి గాయాలు

ప్రమాదంలో దెబ్బతిన్న కారు

లింగాల, ఏప్రిల్ 24: మండలంలోని సూరాపూర్ గేట్ సమీపంలో ఎదురెదురుగా వస్తున్న రెండు కార్లు ఢీ కొని పది మందికి స్వల్ప గాయాలైన ఘటన బుధవారం చో టు చేసుకున్నది. స్థానికుల కథనం మేరకు అచ్చంపేట నుంచి మండలంలోని కోమటికుంట వస్తున్న కారు, లింగాల నుంచి అచ్చంపేటకు వెళ్తున్న కారు సూరారం గేటు సమీపంలో ఎదురెదురుగా ఢీ కొన్నాయి. ఈ ప్రమాదంలో ఓ కారు ఫ్లీలు కొట్టుకుంటూ రోడ్డు పక్కన వ్యవసాయ పొలంలోకి దూసుకుపోగా మరో కారు ముందు భాగం నుజ్జు నుజ్జు అయ్యింది. కాగా రెండు కార్లల్లో బెలూన్స్ తెరుచుకోవడంతో అందులో ఉన్న పది మంది స్వల్ప గాయాలతో బయటపడ్డారు. గాయపడ్డవారిని చికిత్స కోసం 108 అంబులెన్స్‌లో అచ్చంపేట ప్రభుత్వ దవాఖానకు తరలించారు. కాగా ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

మహేశ్ (ఫైల్)

వెల్దండ, ఏప్రిల్ 24: రోడ్డు ప్రమాదం లో ఓ యువకుడు మృతి చెందిన ఘటన బుధవారం మండలంలోని కొత్ర గేటువద్ద చోటు చేసుకున్నది. పోలీసుల కథనం మేరకు కొత్ర గ్రామానికి చెందిన వసంతపుమ హేశ్(32) మాడుగులలో జరిగిన బామ్మర్ది పెళ్లికి వెళ్లి తిరిగి సాయంత్రం కారులో స్వగ్రామానికి వస్తుండగా కొత్ర గేటు సమీపంలో జాతీయ రహదారిపై అచ్చంపేట నుంచి హైదరాబాద్‌లోని మేడ్చల్‌కు వెళ్తున్న బస్సు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో మహేశ్‌కు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. కాగా బస్సును ఢీకొన్న కారు అక్కడే ఉన్న మరో ఆటోకు తగలడంతో ఆటోలో ఉన్న వ్యక్తితోపాటు బస్సులో ఉన్న దాదాపు పది మందికి స్వల్ప గాయాలయ్యాయి. గాయపడ్డవారిని కల్వకుర్తి ప్రభుత్వ దవాఖానకు తరలించారు. మృతుడు మహేశ్‌కు భార్య స్వప్న ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రవి తెలిపారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED

★హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి భోజనం. జీతం: 16K to 18K ఏజెంట్ కమీషన్. 6K. Ph: 9640258899, 9640468899.

NT-311831-All

ప్రకటన

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

To Book your Classified
4 lines Advt
Rs. 200/-
Only (B/W)
Additional Line
50/- Only
For Advertisement Enquiry
Please Contact...
9182777641
9182777654
9182777794

అధికారం కోసమే ఆరు గ్యారెంటీలు

- నేటికీ అమలుకు నోచుకోని హామీలు
- కాలయాపన చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం
- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు గువ్వల బాలరాజు

అచ్చంపేటలో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు గువ్వల బాలరాజు

అచ్చంపేట టౌన్, ఏప్రిల్ 24 : కాంగ్రెస్ పార్టీ అధికారం కోసమే ఆరు గ్యారెంటీలు అన్నదని, తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీలు అమలు చేయడం లేదని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు ఆరోపించారు. బుధవారం అచ్చంపేటలో ఆయన బీఆర్ఎస్ నాగర్‌కర్నూల్ పార్లమెంట్ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌కు మద్దతుగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పదేండ్లలో కేసీఆర్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి బీఆర్ఎస్‌ను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ అబద్ధపు హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని అమలు చేయడంలో కాలయాపన చేస్తున్నదని ఆరోపించారు. మూడు నెలల కాంగ్రెస్ పాలనలో పెట్టుబడి సాయం అందక, కరెంట్ లేక పంటలు ఎండిపోయి వందలాది మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పేరుకే ప్రజాపాలన కానీ, ప్రజలకు న్యాయం జరుగడం లేదని విమర్శించారు. అందుకే అభివృద్ధి చేసిన బీఆర్ఎస్ కావాలో అన్యాయం చే సే కాంగ్రెస్ కావాలో ప్రజలు మరోసారి ఆలోచించుకోవాలన్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను అత్యధిక మోజార్టీతో గెలిపిస్తే పార్లమెంట్‌లో మన గొంతు వినిపించే అవకాశం ఉం టుందని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకుడు అమీనొద్దీన్ ఉన్నారు.

కాంగ్రెస్ మాటలు నమ్మి మోసపోయారు

వంగూరు, ఏప్రిల్ 24 : కాంగ్రెస్ పార్టీ నాయకులు చెప్పిన అబద్దాల మాటల నమ్మి ప్రజలు మోసపోయారని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు పేర్కొన్నారు. మండల కేంద్రంలోని వైవీ ఫంక్షన్ హాల్లో బుధవారం వంగూరు, చారకొండ మండలాల బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు గువ్వల బాలరాజు హాజరై కార్యకర్తలకు దిశా, నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకిచ్చిన హామీలను తుంగలో తొక్కి ఎంపీ ఎన్నికల ముందు మరింత మోసపూరిత వాగ్దానాలు చేస్తూ ప్రజలను మభ్యపెడుతున్నారన్నారు.

ఇసుకను అక్రమంగా కొల్లగొడుతున్నారు..

దుందూభీ నదిలో అక్రమంగా ఇసుకను కొల్లగొడుతూ కాంగ్రెస్ నేతలు కాసులు వెనకేసుకుంటున్నారు. ట్రాక్టర్లను నడవకుండా చేసి మధ్య తరగతి జీవితాలతో ఆటలాడుతూ టిప్పర్ల ద్వార అడ్డగోలుగా ఇసుకను తరలిస్తుంటే అధికార పక్షం వారికి అండగా నిలుస్తుందన్నారు. ఇసుక మాఫియా అద్దు అదుపూ లేకుండా ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తూ దుందూభీని ఖాళీ చేస్తూ కోట్టు గడిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థిగా ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పని చేయాలన్నారు. ప్రచారాన్ని ఉదయం, సాయంత్రం ఇంటింటికీ తిరుగుతూ కార్యకర్తలు పని చేయాలని కోరారు. 27న బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నాగర్‌కర్నూల్ పట్టణంలో నిర్వహించే రోడ్‌షో కార్యక్రమానికి హాజరవుతున్నందున పెద్ద ఎత్తున బీఆర్ఎస్ శ్రేణులు తరలి వచ్చేలా నేతలు కృషి చేయాలన్నారు. సమావేశంలో చారకొండ బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రవీందర్, వంగూరు మండల మాజీ అధ్యక్షుడు గణేశ్‌రావు, రాజేందర్‌రెడ్డి, నరేందర్‌రావు, నాయకులు లాలూయాదవ్, విజేందర్‌గౌడ్, సురేందర్, అంజీ, పుల్లయ్యయాదవ్, ఎల్లాగౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో నామినేషన్ ప్రక్రియ

- జిల్లా రిటర్నింగ్ అధికారి ఉదయ్‌కుమార్

సమావేశంలో పాల్గొన్న జిల్లా అధికారులు

నాగర్‌కర్నూల్, ఏప్రిల్ 24: ప్రశాంత వాతావరణంలో నామినేషన్ ప్రక్రియ పూర్తి చేస్తామని జిల్లా ఎన్నికల అధికారి ఉదయ్‌కుమార్ వివరించారు. బుధవారం రాత్రి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్, ఇతర ఉన్నతాధికారులతో కలిసి నామినేషన్ల చివరి రోజు ఏర్పాట్లు, పోస్టల్ బ్యాలెట్ ముద్రణ, హోం ఓటింగ్ కోసం ఏర్పాట్లు, తదితర అంశాలపై జిల్లా ఎన్నికల అధికారులతో వీడియోకాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా ఎన్నికల అధికారి ఉదయ్‌కుమార్ మాట్లాడుతూ పకడ్బందీగా నామినేషన్లు స్వీకరిస్తున్నామని, చివరి రోజు నామినేషన్ల స్వీకరణ ప్రశాంతంగా నిర్వహిస్తామన్నారు. నామినేషన్ స్వీకరణ, స్క్రూట్నీ, ఉపసంహరణ, పోటీలో ఉన్న అభ్యర్థుల తుదిజాబితా ప్రకటన, స్వతంత్ర అభ్యర్థులకు గుర్తుల కేటాయింపు, బ్యాలెట్ పేపర్ రూపకల్పన వంటి అంశాలను ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం పకడ్బందీగా నిర్వహిస్తున్నామన్నారు. వీసీ అనంతరం కలెక్టర్ జిల్లా ఎన్నికల అధికారులతో మాట్లాడుతూ ఫాం 12కి కింద ఇంటి వద్ద ఓటు హక్కు వినియోగించుకునేందుకు దరఖాస్తు చేసుకున్న దివ్యాంగులు, సీనియర్ సిటిజన్లు, పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకునేందుకు దరఖాస్తు చేసుకున్న అత్యవసర విధుల నిర్వహణ వివరాలు పకడ్బందీగా నమోదు చేయాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ కుమార్ దీపక్, సీతారామారావు, వనపర్తి అదనపు కలెక్టర్ సంచిత గంగ్వార్, నోడల్ అధికారులు పాల్గొన్నారు.

ఆరో రోజు నాలుగు నామినేషన్లు

నాగర్‌కర్నూల్ లోక్‌సభ స్థానానికి బుధవారం నాలుగు నామినేషన్లు దాఖలైనట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ ఉదయ్‌కుమార్ తెలిపారు. విద్యార్థుల రాజకీయ పార్టీ అభ్యర్థిగా ఒగ్గు వినయ్ ఒక సెట్ నామినేషన్, ఇండియా ప్రజాబంధు పార్టీ అభ్యర్థిగా విసనకర్ర అమర్నాథ్ ఒక సెట్, స్వతంత్ర అభ్యర్థులు గీత, లంద భిక్షపతి రెండో సెట్ నామినేషన్ పత్రాలను దాఖలు చేసినట్లు తెలిపారు. ఇప్పటి వరకు నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గ స్థానానికి 15 మంది అభ్యర్థులు 23 నామినేషన్లు దాఖలు చేశారని రిటర్నింగ్ అధికారి తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గురువారం నామినేషన్ల ప్రక్రియ ముగుస్తుందని, మధ్యాహ్నం 3 గంటల వరకే నామినేషన్లు దాఖలు చేసేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు.

కాలుష్య కోరల్లో తెలంగాణ ఊటీ

- అమరగిరి పరిసరాల్లో చెత్త డంపింగ
- దెబ్బ తింటున్న ప్రకృతి అందాలు
- దుర్గంధం, పొగతో గిరిపుత్రులు, పర్యాటకుల ఇబ్బందులు

అమరగిరి రోడ్డు వెంట వేసిన చెత్తచెదారం

కొల్లాపూర్ రూరల్, ఏప్రిల్ 24: తెలంగాణ ఊటీగా పేరొందిన నల్లమల అటవీ ప్రాంతంలోని అమరగిరి కాలుష్య కోరల్లో చిక్కుకుంటుందని గిరిపుత్రులు, పర్యాటకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొల్లాపూర్ పట్టణానికి 8 కిలోమీటర్ల దూరంలో దట్టమైన నల్లమల అటవీ ప్రాంతంలో కృష్ణానది ఒడ్డున ప్రకృతి ఒడిలో ఉన్న అమరగిరి చెంచులు, మత్స్యకారులు అధికారుల నిర్లక్ష్యంతో స్వచ్ఛమైన గాలికి దూరం కానున్నారు. కొల్లాపూర్ పట్టణంలో సేకరించిన చెత్తను మున్సిపాలిటీ సిబ్బంది సేకరించిన చెత్తను అమరగిరి వెళ్లే దారిలో డంప్ చేయడంతో ప్రాంతమంతా అపరిశుభ్రంగా మారాడంతో పాటు దుర్వాసన వెదజల్లుతోందని గ్రామస్తులతో, పర్యాటకులు వాపోతున్నారు. డంప్ చేసిన చెత్తకు నిప్పంటించడంతో కొన్ని రోజులపాటు దట్టమైన పొగ అల్లుకుపోయి ఊపిరి పీల్చుకోలేక పోతున్నామని గిరిపుత్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అందమైన ప్రకృతి అందాలతో ఆకర్షించే అమరగిరి రహదారి అధికారుల నిర్లక్ష్యంతో కాలుష్యం, దుర్వాసన పర్యాటకులకు స్వాగతం పలుకుతోందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇప్పట్టికైనా సంబంధిత అధికారులు స్పందించి డంప్ చేసిన చెత్తను తొలగించి అమరగిరి ప్రకృతి అందాలను కాపాడాలని గ్రామస్తులతో పాటు పర్యాటకులు కోరుతున్నారు.

చెత్తను తొలగిస్తాం

డంప్ యార్డు గురించి కొల్లాపూర్ మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసన్‌ను వివరణ కోరగా అమరగిరి వెళ్లే దారిలో డంప్ యార్డు కోసం రెవెన్యూ వారు స్థలం కేటాయించారు. పర్యాటకులు, గ్రామస్తులకు ఇబ్బందులు లేకుండా చెత్తను తొలగించేందుకు చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వం ఆదేశిస్తే డంప్ యార్డును అక్కడి నుంచి షిఫ్ట్ చేస్తాం.

- శ్రీనివాసన్, మున్సిపల్ కమిషనర్

ప్రకృతి అందాలు దెబ్బ తింటున్నాయి

తెలంగాణ ఊటీగా పచ్చని చెట్లతో, సెలయేరులతో సహజ సిద్ధమైన అమరగిరి అందాలు అధికారులు నిర్లక్ష్యంతో దెబ్బతింటున్నాయి. వర్షాకాలం ప్రారంభం నుంచి దారి పొడువునా సీతాకోక చిలుకలు పర్యాటకులను అలరించేవి కానీ రహదారి పక్కన డంప్ చేసిన చెత్తతో దుర్గంధం, పొగతో స్వచ్ఛమైన గాలి కాలుష్యమవుతున్నది. వెంటనే డంప్ యార్డును ఎత్తివేయాలి.

- భరత్ యాదవ్, అమరగిరి

బీటీ రోడ్లు వేయాలి

బల్మూరు, ఏప్రిల్ 24: మండలంలోని కొత్తపల్లి గ్రామపంచాయతీ రోడ్లను బీటీగా మార్చాలని గ్రామస్తులు కోరుతున్నారు. గ్రామానికి రెండు ప్రధాన రహదారులు ఉన్నా బీటీ లేక పోవడంతో ప్రయాణానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామంటున్నారు. గోదల్-తుమ్మెన్‌పేట ప్రధాన రోడ్డు నుంచి గ్రామానికి కిలో మీటరు ఉన్న మట్టి రోడ్డుపై ఇబ్బందులు పడుతున్నామంటున్నారు. అదేవిధంగా చెన్నారం-కొండారెడ్డిపల్లి ప్రధాన రహదారి నుంచి 2.5 కిలోమీటర్లు ఉన్న లింక్ రోడ్డు ఉన్నా ప్రయాణానికి ఇబ్బందులు పడుతున్నామన్నారు. గ్రామానికి ఉన్న రెండు ప్రధాన రహదారులను బీటీగా మార్చి ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని ఎమ్మెల్యే వంశీకృష్ణ, అధికారులను కోరుతున్నారు.

కొత్తపల్లి గ్రామ ప్రధాన రోడ్డు

లింగమయ్య నామస్మరణతో మార్మోగిన నల్లమల

- ముగిసిన సలేశ్వరం జాతర

స్వామివారిని దర్శించుకున్న భక్తులు

అచ్చంపేట, ఏప్రిల్ 24: నల్లమల అటవీ లోతట్టు ప్రాంతంలో మూడు రోజులపాటు కొనసాగిన సలేశ్వరం లింగమయ్య జాతర బుధవారం ముగిసింది. చివరి రోజు భక్తులు అధిక సంఖ్యలో తరలి రావడంతో నల్లమల్ల లింగమయ్య నామస్మరణతో మార్మోమోగింది. చిన్న, పెద్దా, వృద్ధులు కాలి నడకతో లోయలు, గుట్టలు అటవీ ప్రాంతాన్ని లెక్క చేయకుండా తరలి వచ్చి లింగమయ్యను దర్శించుకొని తన్మయత్వం పొందారు. గతంలో సలేశ్వరానికి లక్షల సంఖ్యలో భక్తులు తరలివచ్చేవారు. ఈసారి ఎండ తీవ్రతతో పాటు జాతరలకు మూడురోజులే అటవీశాఖ అనుమతులు ఇవ్వడం, పెళ్లిళ్లు అధికంగా ఉండడంతో ఈసారి భక్తుల సంఖ్య తగ్గినట్లు వ్యాపారులు తెలిపారు. కేవలం మూడు రోజులే అవకాశం ఇవ్వడంపై యాత్రికులు, భక్తులు అసహనం వ్యక్తం చేశారు. మరో నాలుగు రోజులు గడువు పెంచితే ఎక్కువ సంఖ్యలో స్వామిని దర్శించుకునే అవకాశం ఉండేదన్నారు. ఎస్పీ గైక్వాడ్ ఆదేశాల మేరకు అచ్చంపేట డీఎస్పీ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. అటవీశాఖ అధికారులు భక్తులకు సేవలందించారు.

హాని కలిగించే పదార్థాలు విక్రయించొద్దు

- జిల్లా ఫుడ్ ఇన్‌స్పెక్టర్ మనోజ్‌కుమార్

ఐస్‌క్రీం తయారీని పరిశీలిస్తున్న ఫుడ్ ఇన్‌స్పెక్టర్

కల్వకుర్తిరూరల్, ఏప్రిల్ 24 : ప్రజల ఆరోగ్యానికి హాని కల్గించే ఆహార పదార్థాలను విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని నాగర్‌కర్నూల్ జిల్లా ఫుడ్ ఇన్‌స్పెక్టర్ మనోజ్‌కుమార్ హెచ్చరించారు. బుధవారం కల్వకుర్తి పట్టణంలో పలు ఐస్‌క్రీం తయారీ కేంద్రాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఐస్‌క్రీం తయారీ పదార్థాలను, తయారైన ఐస్ క్రీంల ను పరిశీలించారు. తయారీ కేంద్రాల్లో నిబంధనలకు విరుద్ధంగా తయారైన కలర్స్, ఐస్ క్రీంలను పారబోసి తయారీదారులపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా ఆహార పదార్థాల్లో కల్తీలు చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

కొనుగోలు కేంద్రం పరిశీలన

వరి కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

పెద్దకొత్తపల్లి, ఏప్రిల్ 24 : మండలంలోని దేవునితిర్మలాపూర్‌లో సింగిల్‌విండో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని బుధవారం జిల్లా పౌరసరఫరా శాఖాధికారులు రామ్మోహన్, నర్సింగ్‌రాజ్ పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు పండించిన వరి ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. గన్నీబ్యాగుల కొరత లేకుం డా ప్రతి కొనుగోలు కేంద్రానికి సరఫరా చేస్తున్నట్లు వారు తె లిపారు. రైతులు దళారులకు ధాన్యాన్ని విక్రయించరాదన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి మద్దతు ధర పొందాలని సూచించారు. కార్యక్రమంలో సింగిల్‌విండో సీఈవో సిరాజ్, రైతులు పాల్గొన్నారు.

రెండు రోజుల్లో సమస్యలను పరిష్కరిస్తాం

- మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసన్

పేరుకుపోయిన చెత్తను పరిశీలిస్తున్న శ్రీనివాసన్

కొల్లాపూర్, ఏప్రిల్ 24 : వార్డుల్లో నెలకొన్న సమస్యలను రెండు రోజుల్లో పరిష్కరిస్తానని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసన్ అన్నారు. బుధవారం ఆయన పట్టణంలోని 11వ వార్డులో పర్యటించారు. ఈ సందర్భంగా వార్డులో ఏషియన్ డైమండ్ స్కూల్ వద్ద డ్రైనేజీలో చెత్తాచెదారం పేరుకు పోయిందని, తాగునీటి సమస్య ఉందని కాలనీవాసులు కమిషనర్ దృష్టికి తెచ్చారు. స్పందించిన కమిషనర్ మాట్లాడుతూ రెండు రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఆయన వెంట మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం

ఆర్థిక సాయం అందజేస్తున్న నాయకులు

కల్వకుర్తి/చారకొండ, ఏప్రిల్ 24 : కల్వకుర్తి పట్టణం కల్యాణ్‌నగర్ కాలనీకి చెందిన కృష్ణయ్యగౌడ్ కుటుంబానికి బుధవారం కల్వకుర్తి గౌడ్ సంఘం ఆధ్వర్యంలో రూ.5వేలు ఆర్థికసాయం అందించారు. కృష్ణయ్యగౌడ్ గుండెపోటుతో మృతి చెందగా బాధిత కుటుంబాన్ని ఆ సంఘం నాయకులు పరామర్శించారు. అదేవిధంగా చారకొండ మండలం జూపల్లి గ్రామానికి చెందిన కల్పన అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ యువ నేత కాయితీ ఆషాదీప్‌రెడ్డి మృతురాలి కుటుంబాన్ని పరామర్శించి రూ.5వేలు ఆర్థిక సాయం అందజేశారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటానని భరోసా కల్పించారు. పరామర్శించిన వారిలో నాయకులు రుక్కులు గౌడ్, అనంద్‌గౌడ్, నరేశ్‌గౌడ్, నాగరాజు గౌడ్ తదితరులు ఉన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

చారకొండ, ఏప్రిల్ 24: మండల కేంద్రంలోని రైతు వేదికలో ఎంపీపీ నిర్మలావిజేందర్‌గౌడ్ అధ్యక్షతన గురువారం ఉదయం 11గంటలకు మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ఇసాక్ హుస్సేన్ బుధవారం ప్రకటనలో పేర్కొన్నారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ రానున్నట్లు చెప్పారు. సర్వసభ్య సమావేశానికి ప్రజాప్రతినిధులు, మండల స్థాయి అధికారులు తప్పకుండా హాజరుకావాలని కోరారు.

డిప్లోమా కోర్సుల్లో శిక్షణ

గద్వాల, ఏప్రిల్ 24 : రాష్ట్రంలోని యువతకు ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ వారు డిప్లొమా కోర్సుల్లో మూడేండ్ల శిక్షణ ఇవ్వనున్నట్లు చేనేతజౌళిశాఖ సహాయ సంచాలకులు గోవిందయ్య బుధవారం ప్రకటనలో తెలిపారు. తెలంగాణకు 9సీట్లు కేటాయించారని ఇందులో ఈడబ్ల్యూఎస్ కేటగిరి వారికి రిజర్వ్ కేటాయించినట్లు తెలిపారు. ఈ శిక్షణకు పదో తరగతి ఉత్తీర్ణులై 16జూలై 2024 నాటికి 15-23 ఏండ్ల వయస్సు ఉన్న ఓబీసీ జనరల్ కేటగిరి, 15-25 ఏండ్ల వయస్సు ఉన్న ఎస్సీ, ఎస్టీ కేటగిరి వారు అర్హులన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు దరఖాస్తు లను జూన్ 10వతేదీ లోగా ప్రిన్సిపాల్ ఎస్‌పీకేఎం ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ వెంకటగిరి చిరునామాకు పంపాలన్నారు .ఇతర వివరాలకు చేనేత జౌళిశాఖ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.